క్లుప్తంగా

నిమిషాల్లో నూర్పిడి..!

వరికోత యంత్రాలతో మేలు
రైతులకు మిగులుతున్న కూలి
అద్దెకు కోత మిషన్లు



వరికోస్తున్న యంత్రం

షాబాద్‌: గతంలో వ్యవసాయం చేయాలంటే ఎంతో వ్యయ, ప్రయాసాలనోర్చి చేయాల్సి ఉండేది. ఎద్దులతో అరక చేత పట్టి పొద్దస్తమానం దున్నేవారు. విత్తనం వేసింది మొదలు పంట ఇంటికి చేరేదాక కూలీల అవసరం ఉంటుంది. దీంతో రైతు తన స్తోమత మేరకే పంటలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకునేవారు. ప్రస్తుతం వ్యవసాయంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్న మడి దున్నినా ట్రాక్టర్‌తో దున్నుతున్నారు. విత్తనం కూడా ట్రాక్టర్‌తోనే వేస్తూ వ్యవసాయంలో ప్రతీ పనికి యంత్రాలను విరివిగా వాడుతున్నారు. క్రమక్రమంగా వ్యవసాయరంగంలో కొత్తపద్ధతులను తీసుకొచ్చి రైతులు దూసుకపోతున్నారు. ఈ విషయంలో రైతులకు శారీరక శ్రమ తగ్గడంతో పాటు పెట్టుబడులు కూడా తగ్గుతున్నాయి. అందుకే ఒక్కో రైతు ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు వరి పంటను కూలీలతో కోయించి, నూర్పిడి కోసం యంత్రాన్ని వాడేవారు. ప్రస్తుతం వరికోత యంత్రాలతోనే వరిపంటను పొలంలోనే నూర్పిడి చేయిస్తున్నారు. ఈ విధానంతో రైతు ఒకేసారి ధాన్యం సంచులు నింపుకునే ఆస్కారం కలుగుతుంది. యంత్రవినియోగానికి గంటకు రూ. 2,200 అద్దె తీసుకుంటున్నారు. గంట వ్యవధిలో ఎకరా పొలంలోని వరిపంటను ఆ యంత్రం నూర్పిడి చేస్తుంది. రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో కూలీల కొరతతో నేలపాలయ్యేవి. కాని ప్రస్తుతం యంత్రాలు రావడంతో అన్నదాతలకు కూలీల కొరతతో ఇబ్బందులు దూరమయ్యాయి. రైతు ఒక్కడు ఉంటే చాలు నిమిషాల్లో ధాన్యం ఇంటికి చేరుతుంది. షాబాద్ మండల కేంద్రంలో పది వరకు వరికోత యంత్రాలు అద్దెకు అందుబాటులో ఉన్నాయి. వివిధ గ్రామాల్లోని రైతులు వరిపంటను మొత్తం యంత్రాల ద్వారానే నూర్పిడి చేయిస్తున్నారు.



నూర్పిడి చేసిన గింజలను ఒకచోట పోస్తున్న యంత్రం

ప్రజల మధ్యే ఉంటా

కాంగ్రెస్‌ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
ఓడిపోయానని అధైర్య పడొద్దు



మహేశ్వరం: ఎన్నికల్లో ఓడిన మహేశ్వరం నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉండి సేవ చేస్తానని కాంగ్రెస్‌ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ఓటు వేసిన కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎన్నికల్లో అతి తక్కువ సమయంలో చాలా మంది మద్దతుగా నిలవడం ఆనందకరమన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చేలా బాధ్యత తీసుకుంటానన్నారు. పదవులతో సంబంధం లేకుండా మహేశ్వరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు తాను ఓడిపోయానని అధైర్యపడవద్దని సూచించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తా



శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల తీర్పును శిరసావహిస్తామని, ఓటమికి కుంగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు దగ్గరవుతానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో మాట్లాడుతూ.. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని రెట్టింపు ఉత్సాహంతో ప్రజలతో అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానన్నారు. ఈ పోరాటంలో తన వెన్నంటి నడిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ శ్రేణులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, ఏ ఆపద ఉన్నా తను ఉన్నాననే విషయాన్ని మర్చిపోవద్దని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. తనకోసం పనిచేసిన ప్రతీ ఒక్కరిని మరిచిపోలేనన్నారు. ఈ ఓటమి భవిష్యత్తులో తన గెలుపునకు నాంది పలుకుతుందన్నారు.

కాంగ్రెస్‌ గెలుపు సంబరాలు

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ అభ్యర్థులు గెలవడంతో ఆదివారం నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు, పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. శివశంకర్‌గౌడ్‌, శ్యాంసుందర్‌రెడ్డి, వీరమోని దేవేందర్‌, గోవర్ధన్‌గౌడ్‌, వేణుగోపాల్‌గౌడ్‌, సుదర్శన్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు. కొందుర్గులో మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలి రాజు పాల్గొన్నారు. కేశంపేటలో జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి పార్టీ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలను ఆమె అభినందించారు.



షాద్‌నగర్‌లో కాంగ్రెస్‌ నేతల సంబురాలు



కొత్తూరు: అభ్యర్థి శంకర్‌తో కలిసి సంబురాలు చేసుకుంటున్న నాయకులు



షాద్‌నగర్‌:వీర్లపల్లి శంకర్‌తో మున్సిపల్‌ కార్మికులు



కేశంపేట: కాంగ్రెస్‌ నాయకులు సంబురాలు



కొత్తూరు: సంబురాల్లో కార్యకర్తలు



ఎలికట్టలో కాంగ్రెస్‌ నాయకుల బైక్‌ర్యాలీ



షాద్‌నగర్‌: పావురాన్ని ఎగుర వేస్తున్న చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



కొందుర్గులో విజయోత్సవ వేడుకలను జరుపుకొంటున్న కాంగ్రెస్‌ నాయకులు

ఆచారికి ఆరో'సారి'

మళ్లీ నిరాశే
రెండో స్థానానికే పరిమితం

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆచారికి నిరాశే మిగిలింది. కల్వకుర్తి నుంచి ఆరోసారి పోటీ చేసిన ఆయనకు కలిసిరాలేదు. విజయం అంచుల దాకా వచ్చి వెనుతిరిగారు. వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. జాతీయ స్థాయి నేతగా ఎదిగారు. 1996లో ఆమనగల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి కృషి చేశారు. బీజేపీలో మండల నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాలు పనిచేశారు. జాతీయ బీసీ కమీషన్‌ సభ్యుడిగా నియమితులై తనదైన శైలిలో పనిచేసి అందరి మన్ననలు అందుకున్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి 8,682 ఓట్లు సాధించారు. 2004లో 54వేల ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2009లో 25 వేల ఓట్లు రాబట్టారు. 2014 ఎన్నికల్లో కేవలం 72 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2018 ఎన్నికల్లో ఐదోసారి పోటీచేసిన ఆచారి.. 3వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 5,410 ఓట్ల తేడాతో పరాజితులయ్యారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన విజయం ఖాయమని అందరూ భావించినప్పటికీ అదృష్టం కలిసిరాలేదు.

నోటాకు 1,819 ఓట్లు

రాజేంద్రనగర్‌: నియోజకవర్గ పరిధిలోని దాదాపు 1819 ఓటర్లు నోటాకు ఓటు వేశారు. గతనెల 30న జరిగిన శాసనసభ ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లు పెద్ద సంఖ్యలో బరిలో నిలిచిన అభ్యర్థులను కాకుండా నోటాకు ఓటు వేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు మొత్తం 25 మంది ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ వారందరికి తమ ఓటు కాదని... నియోజకవర్గానికి చెందిన 1819 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో నోటాకు మొత్తం 1,819 ఓట్లు వచ్చాయి.

యథేచ్ఛగా సెల్‌టవర్ల ఏర్పాటు

- రేడియేషన్‌తో హాని
- అనారోగ్యాల బారిన జనం
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: మండలంలో ఇప్పటికే పలు పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు ఇటీవలి కాలంలో అనుమతులు లేకుండానే ఇళ్ల మధ్యలో కొత్తగా సెల్‌ఫోన్‌ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. సెల్‌టవర్ల సమీపంలో రేడియేషన్‌ ప్రభావం అధికంగా ఉంటుందని తరచూ ఆయా సందర్భాల్లో వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు మండల కేంద్రానికే పరిమితమయ్యే టవర్లు ఆయా కంపెనీల మధ్య పోటీ పెరగడంతో కొత్త కస్టమర్లు, నాణ్యమైన సేవలు అందించాలనే దృక్పథంతో ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో కూడా టవర్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఇళ్ల మధ్య టవర్లతో..

ఇళ్ల మధ్య సెల్‌ఫోన్‌ టవర్లను ఏర్పాటు చేయడంతో రేడియేషన్‌ ప్రభావంతో సమీపంలో నివసించే ప్రజలు తరచుగా అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలు, పలు వైద్య బృందాలు వెల్లడించాయి. రేడియేషన్‌ ప్రభావం ఎక్కువైతే పలు రకాలైన క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంటుందని తరచుగా వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఐనప్పటికీ ఈ విషయంలో పట్టించుకునే



జనావాసాల మధ్య టవర్‌ (ఫైల్‌)



ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన టవర్‌ (ఫైల్‌)

వారు కరువయ్యారు. క్యాన్సర్ల బారిన పడిన కొందరు చికిత్సలు చేయించుకుంటున్నారు. మరికొందరు మృతి చెందారు. అంతేకాకుండా భారీ ఈదురుగాలులు వీచే సమయంలో పలుచోట్ల సెల్‌టవర్లు విరిగి ఇళ్లపై పడిన సంఘటనలు లేకపోలేదు. సెల్‌టవర్లతో అనేక వ్యాధులు వస్తున్నాయనే విషయం తెలియక ఇంటి యజమానులకు నెలనెల పెద్దమొత్తంలో అద్దె చెల్లిస్తుండడంతో వారు కిమ్మనడం లేదు.

పన్నులు సైతం చెల్లించని వైనం...

మండలంలో ఇప్పటికే పదుల సంఖ్యలో ఆయా కంపెనీల సెల్‌టవర్లను ఏర్పాటు చేశారు. కాగా అందులో కొందరు పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోగా మరికొందరు నాయకులకు ముడుపులు అందించి టవర్లను ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం టవర్లను ఏర్పాటు చేసే ముందు నిర్వాహకులు మున్సిపాలిటీ, పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలి. అంతేకాకుండా సమీపంలోని ఇళ్ల ప్రజలు టవర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తే జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి. దానికి తోడు ప్రతి సంవత్సరం ఒక టవర్‌ సామర్థ్యాన్ని బట్టి సంబంధిత పంచాయతీకి పన్నుల రూపంలో సుమారుగా రూ.10 వేలు చెల్లించాలి. కానీ మండలంలో చాలా వరకు టవర్లను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు పన్నులు చెల్లించడం లేదు. ఏది ఏమైనప్పటికీ ప్రజా ఆరోగ్యం దృష్ట్యా సెల్‌ టవర్ల ఏర్పాటు తగ్గించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



శంకర్‌పల్లి: మోకిల తండాలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

చేవెళ్లలో బీఆర్‌ఎస్‌ విజయం

- హ్యాట్రిక్‌ విజయం సంతోషకరం

షాబాద్‌: బంగారు తెలంగాణ పునఃనిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని షాబాద్‌ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం షాబాద్‌ మండల కేంద్రంలో అంబేద్కర్‌, బాబూ జగ్జీవన్‌రామ్‌, జ్యోతిరావుపూలే, దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. మల్లారెడ్డిగూడ, దామర్లపల్లి, రుద్రారం, నాగరగూడ చౌరస్తాలో స్వీట్లు పంచి టపాకాయాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎల్‌ఎఫ్‌ జిల్లా లీగల్‌ అడ్వైజర్‌ పీసరి సతీష్‌రెడ్డి, గణేష్‌గౌడ్‌, రాంచందర్‌, సుధాకర్‌గౌడ్‌, మల్లారెడ్డి, ప్రభాకర్‌గౌడ్‌, రాజుగౌడ్‌, రమేశ్‌, బాల్‌రాజ్‌, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హ్యాట్రిక్‌ విజయం సాధించడం సంతోషకరమని మండల బీఆర్‌ఎస్‌ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఎన్నికల ఫలితాల్లో యాదయ్య గెలుపొందడంతో శంకర్‌పల్లి మున్సిపల్‌ పరిధిలోని పలు వార్డుల్లో, పలు గ్రామాల్లో పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు తినిపించుకొని బాణాసంచ కాల్చారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్‌, రవి నాయక్‌, గొడిచర్ల వెంకటేష్‌, నాగరాజు, గోపాల్‌రెడ్డి, వాసుదేవ్‌ఖన్నా, రవిందర్‌గౌడ్‌, కురుమ వెకంటేష్‌, సత ప్రవీణ్‌కుమార్‌, పాండురంగారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్‌ కోల్పోయిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

రాజేంద్రనగర్‌: నియోజకవర్గ బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు తమ డిపాజిట్లను కోల్పోయారు. మజ్లిస్‌, బీఎస్పీతో సహా ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ ధారవత్తును కోల్పోయారు. కేవలం బీజేపీ, కాంగ్రెస్‌ అభ్యర్థులు తప్పా... పోటీ చేసిన 22 మంది అభ్యర్థులు తమ డిపాజిట్లను కోల్పోయారు. మొత్తం 3,24,917 ఓట్లు పోలయ్యాయి. దీంట్లో 16 శాతం ఓట్లు వచ్చిన వారికే డిపాజిట్లు దక్కుతుంది. మజ్లిస్‌ పార్టీ, బీఎస్పీతో సహా స్వతంత్రులెవరికీ 16 శాతం ఓట్లు పోలు కాలేదు. వీరంతా డిపాజిట్లు కోల్పోయారు.



కమ్ముకున్న పొగ మంచు

షాబాద్‌ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం పొగ మంచు కమ్మేసింది. ఉదయం 5గంటల నుంచి 8 గంటల వరకు మండలాన్ని పొగ కప్పేసింది. ఉదయం పూట రోడ్డుపై వెళ్తున్న వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది కలిగించింది. ఇలా పొగ మంచు గ్రామాలను కమ్ముకోవడంతో ఉదయమే చీకటిని తలపించింది.

– షాబాద్‌

వీర్లపల్లి విజయ భేరి



కౌంటింగ్‌ కేంద్రం వద్ద అభివాదం చేస్తున్న వీర్లపల్లి శంకర్‌

- షాద్‌నగర్‌లో కాంగ్రెస్‌ విజయ ఢంకా

షాద్‌నగర్‌: షాద్‌నగర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ విజయఢంకా మ్రోగించింది. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి అంజయ్య యాదవ్‌పై వీర్లపల్లి శంకర్‌ విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్‌ నేతలు సంబురాలు జరుపుకున్నారు.

6,562 ఓట్లతో..

షాద్‌నగర్‌ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1,94,027 ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్‌ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌కు 77,817ఓట్లు, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి అంజయ్య యాదవ్‌కు 70,689, ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి 31,651 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అందెబాబయ్యకు 8,164ఓట్లు పోలయ్యాయి. వీర్లపల్లి శంకర్‌ 6,562 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

ప్రతీ రౌండ్‌లోనూ ఆధిక్యం..

కాంగ్రెస్‌ ప్రతీ రౌండ్‌లో ఆధిపత్యం కొనసాగించింది. మొదట కొత్తూరు మండలం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. తర్వాత చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో బీఆర్‌ఎస్‌ పార్టీకి స్వల్ప ఆధిక్యం లభించింది. కేశంపేట, ఫరూఖ్‌నగర్‌, షాద్‌నగర్‌ పట్టణంలో కాంగ్రెస్‌ మెజార్టీ ఓట్లను సాధించింది.



విజయ చిహ్నం చూపిస్తున్న కాంగ్రెస్‌ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌

పోస్టల్‌ బ్యాలెట్‌లోనూ ఆధిక్యం..

పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లను మూడు టేబుళ్లలో కౌంటింగ్‌ నిర్వహించారు. ఇందులో కూడా కాంగ్రెస్‌ మెజార్టీ లభించింది.

నేతల సంబురాలు..

వీర్లపల్లి శంకర్‌ విజయం సందర్భంగా పార్టీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. కౌంటింగ్‌ కేంద్రానికి వచ్చిన వీర్లపల్లి శంకర్‌కు ఆ పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. కౌంటింగ్‌ కేంద్రం నుంచి నేరుగా షాద్‌నగర్‌ పట్టణానికి చేరుకున్న వీర్లపల్లి శంకర్‌కు అడుగడుగునా ఆ పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. భారీ ఎత్తున బాణా సంచాకాల్చారు. డీజేలు పెట్టి సంబురాలు జరుపుకున్నారు.

ట్రా'ఫికర్‌'

- బస్టాపులు, రోడ్లపైనే వాహనాల పార్కింగ్‌
- అలంకారప్రాయంగా సిగ్నల్‌ వ్యవస్థ
- ఇబ్బందుల్లో జనం

మొయినాబాద్‌: మొయినాబాద్‌లో ట్రాఫిక్‌ సమస్య రోజు రోజుకు పెరిగిపోతోంది. హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపైనే వాహనాలను పార్కింగ్‌ చేస్తుండడంతో ట్రాఫిక్‌ నిలిచిపోతుంది. ప్రధాన చౌరస్తాలో వాహనాలు ఎటు నుంచి ఎటు పోతున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నాలుగు వైపులనుంచి ఒకే సారి వాహనాలు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పాదాచారులు చెబుతున్నారు. ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ ఏర్పాటు చేసినా దాన్ని వినియోగించడంలేదు. మరోవైపు ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌ మహానగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్‌లో ట్రాఫిక్‌ సమస్య రోజురోజుకు ప్రధాన సమస్యగా తయారవుతుంది. ప్రధాన రహదారికి ఇరుపక్కల ఉన్న షాపులు, హోటళ్లు, బ్యాంకుల ముందు వాహనాలను ఇష్టం వచ్చినట్లు పార్కుచేస్తున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనాలకు, పాదాచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొయినాబాద్‌ ప్రధాన చౌరస్తాలో ఉదయం పూట వందలాది మంది అడ్డాకూలీలు రోడ్డుపైనే నిలబడతారు. దీంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం ఏర్పడడంతోపాటు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.



ప్రధాన చౌరస్తాలో పనిచేయని సిగ్నల్స్‌

బస్టాపుల్లో పార్కింగ్‌...

ఇక్కడ బస్టాపుల్లోనే ఆటోలు నిలుపుతుండడంతో బస్సులు వచ్చి రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీంతో వెనక నుంచి వచ్చిన వాహనాలు, బస్సుల వెనకాలే ఆగడంతో బస్సులు కదిలేంత వరకు ట్రాఫిక్‌లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాపుల వద్దే బ్యాంకులు ఉండడంతో బ్యాంకులకు వచ్చినవారు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. అదే విధంగా రోడ్డుకు ఇరుపక్కల ఉన్న షాపుల ముందు టీ పాయింట్లు, జ్యూస్‌ బండ్లు, పానిపూరి బండ్లు ఏర్పాటు చేయడంతో షాపుల ముందు పార్కింగ్‌ స్థలం లేకుండా పోతుంది.

పనిచేయని సిగ్నల్‌ వ్యవస్థ...

ట్రాఫిక్‌ సమస్య తీర్చడంకోసం ప్రధాన చౌరస్తాలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఆ సిగ్నల్స్‌లను వినియోగించడంలేదు. సిగ్నల్‌ ఆపరేటింగ్‌ లేకపోవడంతో ప్రధాన చౌరస్తాలో నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు రావడంతో ట్రాఫిక్‌ జాం అవుతుంది. సిగ్నల్‌ ఏర్పాటు చేసినా దాన్ని ఎందుకు వినియోగించడంలేదో ట్రాఫిక్‌ పోలీసులకే తెలియాలి. ప్రతీ సోమవారం మొయినాబాద్‌లో సంత ఉండడంతో ఆ రోజు ట్రాఫిక్‌ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్‌ క్లియర్‌ చేసేందుకు హోంగార్డు ఉంటున్నా కేవలం ఫొటోలు తీసి చలాన్లు వేయడమే పనిగా పెట్టుకున్నారు. హైవే మొబైల్‌ వాహనం సైతం రహదారిపై తిరుగుతూ ఫొటోలు తీయడమే తప్పా ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదు.



రోడ్డుపై నిలిపిన ఆర్టీసీ బస్సు